www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 23 ఫిబ్రవరి 2024

5

కాకినాడ



పర్యావరణ మిత్ర గంగాధర్‌కు మాతృవియోగం



ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మీడియా మేనేజర్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ మాతృమూర్తి తోటకూర నాగమణి(87) వృద్ధాప్యం కారణంతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాగమణి మృతి పట్ల ఆదిత్య అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, మేడపాటి భాస్కర చంద్ర రెడ్డి, ఆదిత్య సిబ్బంది, దవులూరి సుబ్బారావు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముంచుకొస్తున్న గడువు

- పంచాయతీల్లో పేరుకుపోయిన బకాయిలు
- ఇప్పటి వరకు వసూలు 49 శాతమే
- రూ.30 కోట్లు పైనే రావాల్సిన పన్నులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మరో 35 రోజుల్లో గడువు ముగుస్తున్నా జిల్లాలో పంచాయతీల్లో పన్నుల బకాయిల వసూళ్లు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. 50 శాతం కూడా వసూళ్ల లక్ష్యాన్ని అధికారులు ఇప్పటివరకు చేరుకోలేకపోయారు. ఇంకా రావాల్సిన బకాయిలు రూ.30.54 కోట్ల పైనే ఉండడంతో ఆయా పంచాయతీల సిబ్బంది ఉరుకులు, పరుగులు పెడుతూ వసూళ్ల పైనే ప్రధానంగా దృష్టి సారించారు. మరోవైపు ఎన్నికల ఏడాది కావడంతో ఏర్పాట్లపై కీలక శాఖలు నిమగ్నమై ఉండగా నూరు శాతం లక్ష్యాన్ని చేరుకునే అవకాశం కనిపించడం లేదు.



జిల్లాలో పెద్దాపురం డివిజన్లో 213, కాకినాడ డివిజన్లో 172 మొత్తంగా 385 గ్రామ పంచాయతీలున్నాయి. ఏటా ఐవి తమ పరిధిలో ఇళ్లు, వాణిజ్య భవనాలు, హోర్డింగులు, ట్రేడ్ లైసెన్స్‌లు, ప్రైవేటు కుళాయి కనెక్షన్ల నుంచి మొత్తం ఆరు రకాల పన్నులు వసూలు చేస్తాయి. ఇవన్నీ కలిపి ఏడాదికి అన్ని పంచాయతీల నుంచి ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌లు కలిపి రూ.68.51 కోట్ల వరకు పన్నుల రూపంలో వసూలు కావాలి. అయితే అధికారుల నిర్లక్ష్యం సిబ్బంది కొరత కారణాలతో ఏటా 55 నుంచి 60 శాతానికి మించి పన్నులు వసూలు కాక బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో చాలినంత ఆదాయం సమకూరక పంచాయతీలు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పైగా వసూలవుతున్న రాబడిలో సామాన్యులు చెల్లించే పన్నులే అధికంగా ఉంటున్నాయి. పంచాయతీ సిబ్బంది వెళ్తే పన్ను కట్టకపోతే ఇబ్బంది తలెత్తుతుందనే ఉద్దేశంతో వీరంతా పన్నులు చెల్లిస్తున్నారు. కానీ ప్రజా ప్రతినిధులు, వారి పేర్లు చెప్పుకుని తిరుగుతున్న కొందరు, పేరున్న వ్యాపారుల నివాసాల నుంచి మాత్రం పన్నులు వసూలు కావడం లేదు. మరి కొందరు తమకు పన్ను మొత్తం ఎక్కువ పడిందని, న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. ఇలా కోర్టుల పరిధిలో సుమారు రూ.15 కోట్ల వరకూ పన్నులు పెండింగులో ఉన్నాయి. ఈ కేసులు ఎప్పుడు పరిష్కారం అవుతాయో ఎప్పుడు పన్నులు వసూలు అవుతాయనేది పంచాయతీ అధికారులకే స్పష్టత లేదు. ఇలా అన్నిరకాల కారణాలతో జిల్లా వ్యాప్తంగా 2016 నుంచి ఇప్పటి వరకు ఈ బకాయిలు పేరుకుపోయాయి.

50 శాతం మించలేదు

పన్నుల రూపంలో పెద్దాపురం డివిజన్ లో 16.94 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 8.84 కోట్లు అంటే 52.17 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. కాకినాడ డివిజన్లో రూ.42.84 కోట్లకు గాను రూ.20.40 కోట్లు అంటే 47.63 శాతం వసూలయింది. మొత్తంగా ఈ రెండు డివిజన్లలో 48.91 శాతం మాత్రమే వసూలైంది. నాన్ ట్యాక్స్‌లు పెద్దాపురం డివిజన్లో రూ.4.56 కోట్లకు రూ.1.35 కోట్లు అంటే 29.71 శాతం, కాకినాడ డివిజన్లో రూ.4.17 కోట్లకు రూ.2.05 కోట్లు అంటే 49.21 శాతం మొత్తంగా ఈ రెండు డివిజన్లలో 39 శాతం మాత్రమే నాన్ టాక్స్ పన్నులు వసూలు అయ్యాయి.

పది, ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం

ప్రజాశక్తి - కాకినాడ



ఇంటర్మీడియేట్, 10వ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 27 నుంచి టెట్, డిఎస్‌సి పరీక్షలు, మార్చి 1 నుంచి ఇంటర్మీడియేట్ పరీక్షలు, మార్చి 18 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహణకు చేపట్టవలసిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పాల్గొని జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణకు చేపట్టిన కార్యాచరణను ఆయనకు వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో పరీక్షల నిర్వహణ అంశాలపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. ప్రశ్నా, జవాబు పత్రాల భద్రత, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఫర్నిచర్, లైటింగ్, తాగునీరు, ప్రాథమిక వైద్య శిబిరాలు వంటి సౌకర్యాలు, పరీక్షా సమయాల్లో సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు, జిరాక్స్ సెంటర్ల మూసి వేత, పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల వాడకంపై నిషేధం తదితర అంశాలను పటిష్టంగా అమలు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేందుకు అనువుగా అన్ని పరీక్షా కేంద్రాల రూట్లలో ఎక్కువ సంఖ్యలో బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ డి.తిప్పే నాయక్, ఆర్‌జెడి జి.నాగమణి, డిఇఒ పిల్లి.రమేష్, ఆర్‌టిసి ఆర్ఎం శ్రీనివాసరావుపాల్గొన్నారు.

ఇళ్ల పట్టాను మార్చేశారు

- అధికారులు పట్టించుకోవడం లేదు
- కన్నీటి పర్యంతమవుతున్న మహిళ

ప్రజాశక్తి - గండేపల్లి

నిరుపేదరాలైన తనకు జగనన్న ఇళ్ల పట్టా ఇచ్చారని, కాని స్థానిక నాయకులు పట్టాను మార్చేశారని సూరంపాలేనికి చెందిన మహిళ పలివెల వీరలక్ష్మి కన్నీటి పర్యంతమైంది. తన భర్త వీరబాబు 17 ఏళ్లుగా పక్షవాతంతో మంచాన్నపడ్డారన్నారు. తనకు ముగ్గురు సంతానమని పెద్ద కుమారుడు ఏడేళ్ల క్రితం విద్యుత్ షాక్‌కు గురై చనిపోయాడని తెలిపింది. కుమార్తెకు వివాహం చేశానని, చిన్న కుమారుడు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని తెలిపింది. అద్దె ఇంట్లో ఉంటూ తాను కుటుంబాన్ని పోషిస్తున్నాని పేర్కొన్నారు. ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా తనకు సర్వే నెంబర్ 11/1 లో ఆరో నెంబరుతో పట్టా ఇచ్చారన్నారు. ఏడాది క్రితం శంకుస్థాపన చేసుకుని ఇంటి నిర్మాణానికి అన్నీ సిద్ధం చేసుకున్నానని తెలిపింది. ఈ సమయంలో తన చిన్న కుమారుడుకు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాకినాడ ఆసుపత్రిలో చేర్పించానని తెలిపింది. చికిత్స అనంతరం పెద్దాపురం మండలం రాజగోపాల్,


పట్టాను చూపుతున్న లబ్ధిదారురాలు

కొత్తూరులో తన తండ్రి గారి ఇంటి వద్ద నివాసం ఉన్నామన్నారు. ఇటీవల పట్టాలు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని సమాచారం రావడంతో గ్రామానికి వచ్చానన్నారు. తన స్థలంలో వేరే వాళ్లు ఇంటి నిర్మాణం చేసుకున్నారని దీనిపై స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపింది.తనకు ఇంటిని ఇప్పించాలని కోరుతోంది.దీనిపై విఆర్ఒ సూర్యారావును వివరణ కోరగా తాను గత ఆరునెలల గ్రామంలో పనిచేస్తున్నానని తెలిపారు. కలెక్టర్ నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం జగనన్న కాలనీ ఆరో నెంబరుతో ఆమెకు పట్టా ఇచ్చారన్నారు. అనంతరం దానిని 77వ పట్టా నెంబర్‌కు మార్చారన్నారు. గ్రామంలో విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.


విద్యార్థులకు పెన్నులు ఇస్తున్న ఇఒ, ఇతర అధికారులు

పెన్నులు, కంకణం అందచేత

ప్రజాశక్తి - అన్నవరం

మాఘ మాసాన్ని పురస్కరించుకుని అన్నవరం సత్యదేవుని సన్నిధిలో సరస్వతి పూజలను నిర్వహించారు. గురువారం కొండపైన దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో వైదిక సిబ్బంది సరస్వతి అమ్మవారి పాదాల వద్ద పెన్నులు, కంకణాలు ఏర్పాటుచేసి వైదిక పరంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి పెన్ను, కంకణం, ప్రసాదం వితరణ చేశారు. అనంతరం టేకువుడ్‌తో నూతనంగా తయారుచేసిన రథాన్ని ఇఒ రామచంద్రమోహన్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆ రథంపై స్వామివారికి ప్రాకార సేవ నిర్వహించారు.

24 నుంచి అంతర్ జిల్లాల ఖో ఖో పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈనెల 24 నుంచి 26 వరకూ అఖిల భారత ఖో ఖో 65వ ఓపెన్ టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీలు స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాలలో జరగనున్నా యని ఉభయ గోదావరి జిల్లాల ఖో ఖో సంఘం కార్యదర్శి కె పట్టాభి రామ్, నిర్వాహక కమిటీ సెక్రె టరి ఊబా జాన్ కెనడిలు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. రాష్ట్రం లోని 13 జిల్లాల నుంచి 13 పురుషుల టీంలు, 13 మహిళా టీంలు పాల్గొం టుండగా అదనంగా పురు షుల నుంచి ఎంప్లాయిస్ టీమ్ ఒకటి పాల్గొం టున్న ట్టు చెప్పారు. 2 వేలు సంవత్సరంలో సామర్ల కోటలో జాతీయ స్థాయి ఖోఖో పోటీలు జరగగా తదుపరి 24 ఏళ్ళ తరువాత ప్రస్తుతం రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతున్నట్టు చెప్పారు. మూడు రోజులు పాటు రాత్రి, పగలు జరిగే పోటీల్లో 450 మంది క్రీడా కారులు, 60 మంది టెక్నికల్ స్టాఫ్, మరో 80 మంది జిల్లా పరిధిలోని


సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి జాన్ కెనడి

వ్యాయామోపాధ్యాయులు పాల్గొం టున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభను కనపరచిన వారిలో నుంచి క్రీడాకారులను ఎంపిక చేసి పురు షులు, మహిళల నుంచి ఒక్కో టీమ్ లను మార్చి 27 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ డీల్లీ లో జరిగే జాతీ య స్థాయి పోటీలకు పంపించనున్నట్టు చెప్పారు. ప్రతిభ కనపరచిన టీములకు చాంపియన్ షిప్ అందించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పాలిక చంటిబాబు, పిఇటి ఎం.వెంక టేశ్వర్లు, రిటైర్ పిఇటి ఎండివి ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పూడిక తొలగింపు

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక శ్రీరామ్ నగర్‌లో పూడుకుపోయిన డ్రెయినేజీలో క్లీనింగ్ పనులకు పంచాయతీ అధికారులు శ్రీకారం చుట్టారు. 'అస్తవ్యస్తంగా డ్రెనేజీ వ్యవస్థ' శీర్షికతో ఈ నెల 21న ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. గురువారం స్థానిక శ్రీరామ్ నగర్‌లో ఉన్న డ్రయినేజీని పంచాయతి సెక్రటరీ వై.గణేష్ బాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది పూడిక తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తద్వారా మురుగునీటి ప్రవాహానికి మార్గం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ గణేష్ బాబు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడైన సమస్యలు ఉంటే స్థానిక పంచాయతి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, తక్షణమే ఆ


పూడికను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

సమస్యను పరిష్కరించడం జరుగుతుందని 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐఎల్‌టిడి ఎన్నికల్లో సిఐటియు ఘనవిజయం

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రవ్యాప్తంగా ఐఎల్‌టిడి సంస్థలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో సిఐటియు ఘన విజయం సాధించడం అభినందనీయమని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు వారు గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో చీరాల, అనపర్తి, రాజమహేం ద్రవరం బ్రాంచ్‌లో జరిగిన ఎన్నికల్లో ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి వర్కర్స్(సిఐటియు అనుబంధ సంఘం) ఘనవిజ యం సాధించిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో పోలైన మొత్తం ఓట్లలో సిఐటియుకు 1,118 ఓట్లు వచ్చాయని, 338 ఓట్ల ఆధిక్యతతో సిఐటియు విజయం సాధించిందని తెలిపారు. సిఐ టియు విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, ఆ యా కంపెనీలోని కార్మికులకు వారు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట, జగ్గంపేట

సామర్లకోట 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చెయ్యనున్నట్టు ట్రాన్స్ కో ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులలో భాగంగా 33/11 కె.వి సబ్ స్టేషన్ సామర్లకోట నుంచి వచ్చే 11 కెవి ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే మండల కేంద్రమైన జగ్గంపేటలో శుక్రవారం విద్యుత్‌కి అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఇఇ కె. రత్నలారావు తెలిపారు. 11 కెవి గోకవరం రోడ్ ఫీడర్ మరమ్మతులు, చెట్లు నరికివేత కారణంగా జగ్గంపేటలో శ్రీరామ్ నగర్, నెహ్రూ కాలనీ, టీచర్స్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, వైఎస్ఆర్ జగనన్న కాలనీలో శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడనుందన్నారు. కావున ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఇఇలు కోరారు.

బిసి అభ్యర్థికి టిక్కెట్ కేటాయిస్తేనే పొత్తుకు సహకారం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి బిసి అభ్యర్థికే టిక్కెట్‌ను కేటాయించాలని, లేకపోతే పొత్తుకు సహకరించేది లేదని టిడిపికి చెందిన బిసి నాయకులు స్పష్టం చేశారు. మాజీ కార్పొరేటర్ పలివెల ఉషారాణి స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిడిపికి చెందిన బిసి నాయకులు మాట్లాడారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిసి నాయకులు

రూరల్ నియోజక వర్గంలో సుమారు 82 వేల మంది శెట్టిబలిజ ఓటర్లు ఉన్నారని, ఇతర బిసి ఓటరులు సుమారు 50 వేల మంది ఉన్నారని తెలిపారు. అలాంటి నియోజకవర్గంలో బిసిలకు కాకుండా పొత్తులో వేరే సామాజిక వర్గానికి సీటు కేటాయిస్తే తాము పొత్తుకు సహకరించేది లేదన్నా రు. తమ అభిప్రాయాన్ని టిడిపి అధిష్టానంకు తెలియచేసేందుకు మీడియా ముందుకు వచ్చినట్లు చెప్పారు. టిడిపి, జనసేన పొత్తులో ఈ నియోజక వర్గం టిక్కెట్టు ఎవరికి కేటాయిస్తారనే నేటికీ తేల్చలేదని, ఇరు పార్టీలకు చెందిన నాయకుల్ని సమన్వయం చేసే కార్యక్రమం జరగలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ టిక్కెట్టును మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తికి కాకుండా వేరే వారికి కేటాయిస్తే తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా అధికార వైసిపి పార్టీని, ప్రభుత్వాన్ని ఎదుర్కొని అనేక కష్ట నష్టాలు పడినా పార్టీనే నమ్ముకుని ఉన్నామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తుల పేరుతో పిల్లి అనంతలక్ష్మికి అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని వారు పార్టీ అధిష్టానాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో శెట్టి బలిజ సాధికారిక జిల్లా అధ్యక్షులు పంపన బుజ్జి, మాజీ జడ్‌పిటిసి సభ్యులు బుంగా సింహాద్రి, పెరికి సాధికారిక జిల్లా అధ్యక్షులు నరసింహారావు, విశ్వబ్రాహ్మిన సాధికారిక జిల్లా అధ్యక్షులు పండురు జయకృష్ణా , కొప్పుల వెలమ సంగం అధ్యక్షులు యసలపు కన్నబాబు, తూర్పు కాపు సాధికారిక సమితి జిల్లా కన్వీనర్ వెలగల లోవరాజు, రాష్ట్ర రజక సంఘం సభ్యులు తాతపూడి రామకృష్ణ, వాసంశెట్టి అంజిబాబు, అగ్నికుల క్షత్రియ జిల్లా అధ్యక్షులు పెమ్మడి శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం గ్రామంలో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు పంచాయతీ పాలకమండలి ఆమోదం తెలిపింది. గురువారం మధ్యాహ్నం సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శివ రామ కృష్ణ పాలన మరియు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన 11 అంశాలను సభ్యులు ఆమోదానికి ప్రవేశపెట్టారు. స్మశాన వాటికకు వెళ్లే మార్గంలో రూ.19.50 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. పంప బ్రిడ్జ్ పక్కన రూ.20 లక్షల వ్యయంతో షాపింగ్ మాల్ మరియు ఫిష్ మార్కెట్ నిర్మాణ పనులు, పాత


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

బస్టాండ్ సులాబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని ఆమోదించారు. ఆయా పనుల నిర్మాణానికి కలెక్టర్ ఆమోదం లభించిందని సర్పంచ్ కుమార రాజా సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


వెంకట్రావుకు నోటీసు అందచేస్తున్న పోలీసులు

కిసాన్ సెల్ కో-ఆర్డినేటర్ గృహనిర్బంధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మెగా డిఎస్‌సి డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన చలో సెక్రటేరియట్ పిలుపుతో రాష్ట్ర కిసాన్ సెల్ కో ఆర్డినేటర్ ఉమ్మడి వెంకట్రావును స్థానిక పోలీసులు గృహనిర్బంధానికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ ఆయనను ఇంటిలోంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డిని చూసి వైసిపి నాయకుల వెన్నులో వణుకు పుడుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సిని నిర్విహించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ డిమాండ్‌తోనూ చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగందని, అయితే ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసన వ్యక్తం చేయడానికి అవకాశం లేకుండా వైసిపి ప్రభుత్వం పోలీసులతో నిర్బంధం చేయడం దారుణమన్నారు. ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని, లక్ష ఉద్యోగాలను కల్పిస్తామని జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారని న్నారు. ఎన్నికల ముందు కేవలం 6100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పేరుతో డిఎస్‌సి నిర్వహించడం దారుణమని అన్నారు. చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్తున్న పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డిని అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు.


25న ఇఎస్ఐ ఆసుపత్రి ప్రారంభం


మీడియాతో మాట్లాడుతున్న ఎంపి వంగా గీత, ఎంఎల్ఎ ద్వారంపూడి

ప్రజాశక్తి - కాకినాడ

ఈనెల 25న కాకినాడలో సుమారు రూ.114 కోట్లతో నిర్మించిన ఇఎస్ఐ ఆసుపత్రిని ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారని ఎంపి వంగా గీత వెల్లడించారు. ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2020లో ఆసుపత్రి నిర్మాణం పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నిర్మాణ సమయంలో కరోన, భారీ వర్షాలు ఆటకం పరిచినా సకాలంలో పూర్తిచేసిన వైద్య విభాగ నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాకినాడ నుంచి ఇఎస్ఐ ఆసుపత్రి తరలిపోతుండగా తామే కాకినాడలో ఏర్పాటు చేయాలని సిఎం జగన్‌కు సూచించినట్లు తెలిపారు. కార్మికులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించనున్నామని, ఆసుపత్రి సకల సౌకర్యాలతో నాలుగు ఆపరేషన్ థియేటర్లతో నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు, ఎంఇ పి.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



యువతకు ఉపాధి చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి - కాకినాడ

యువతకు ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మోసపూరిత మాయమాటలతో యువతను మోసం చేసి అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో యువతకు ఉపాధి కల్పించలేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయలేదని తెలిపారు. రాష్ట్రానికి ఎటువంటి పరిశ్రమలు తీసుకురాకుండా, జే-టాక్స్ పేరుతో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను ఇతర రాష్ట్రాలకు తరలిపోయేలా చేసాడని విమర్శంచారు. అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని హామీలు ఇచ్చి, ఫిష్ మార్కెట్లు, మటన్ షాపులో, బ్రాందీ షాపుల్లో ఉద్యోగాలంటూ యువత భవిష్యత్తును నాశనం చేశాడన్నారు. రాబోయే ఎన్నికల తరువాత టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని, తమ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులకు అవసరమైన ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో యువతీ యువకులు ప్రతీఒక్కరూ మై ఫస్ట్ ఓట్ ఫర్ చంద్రబాబు నినాదంతో సంసిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ జిల్లా అధ్యక్షులు వనమాడి మోహన్ వర్మ, నాయకులు పలివెల రవి, తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, గాది శివరామకృష్ణ, రహీమ్ పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్ఎ వనమాడి, ఇతర నాయకులు

బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో యానాం ఎంఎల్ఎ శ్రీనివాస్‌అశోక్ పాల్గొన్నారు. వచ్చే ఐదు నెలల కాలానికి రూ.4,634.29 కోట్లతో కూడిన మధ్యంతర బడ్జెట్‌ను గురువారం ఆర్థికమంత్రి హోదాలో పుదుచ్చేరి సిఎం రంగసామి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని వేలంక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంకురాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ కంటి ఆసుపత్రి డాక్టర్ శివ గణేష్ మాట్లాడుతూ దాదాపు 150 మంది విద్యార్థులకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతాళ మహేష్, చైర్మన్ గండే కొండరావు, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, గండే తాతీలు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నేరాలు ఘోరాలు

22 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక మెయిన్ రోడ్‌లోని వినియోగంలో లేని బడ్డీకొట్లో అక్రమంగా నిల్వ చేసిన 22 మద్యం సీసాలను జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ ఎస్ఐ మహ్మద్ అలీ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు గురువారం మూతపడిన బడ్డీ కొట్లో తనిఖీలు చేపట్టగా గోవా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు కె.సత్యారావు సమక్షంలో బడ్డీ కొట్టు తాళం తీశామన్నారు. మద్యం సీసాలను ప్రత్తిపాడు ఎక్సైజ్ కార్యాలయానికి తరలించామన్నారు. నిందితులను గుర్తించి కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఆయన వెంట డిటిఎఫ్ హెచ్‌సి ఇ.ప్రసాద్, కానిస్టేబుల్ నీలిమ, ప్రసాద్, గంగాధర్ ఉన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని రామరాఘవపురం శివారులో నిర్వహిస్తున్న సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ స్వామినాయుడు మాట్లాడుతూ ముందస్తుగా వచ్చిన సమాచారంతో డిఎస్‌పి హనుమంతరావు పర్యవేక్షణలో ట్రైనింగ్ డిఎస్‌పి కె.ప్రమోద్‌తో కలిసి దాడి చేశామని తెలిపారు. ఈ దాడిలో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బట్టీ నిర్వాహకుడు కొత్త మూలపేటకు చెందిన ముత్త తాతారావు పై కేసు నమోదు చేశామని తెలిపారు.

నగదు, బంగారం చోరీ

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం పోతవరం గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం మరానా దోపిడీ జరిగింది. బాధితులు నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బంగారం నగల వ్యాపారి గారిబాబు రూ.5 లక్షల నగదు, మూడున్నర కాసుల బంగారంతో కారులో భీమవరం వెళ్తున్నారు. నల్లజర్ల మండలం పోతవరం సమీపంలో నలుగురు మరో కారులో వచ్చి పోలీసులమని చెప్పి అడ్డగించారు. వ్యాపారిని వారి కారులో ఎక్కించుకున్నారు. రూ.5 లక్షల నగదు, మూడున్నర కేజీల బంగారు నగలను స్వాధీనం తీసుకున్నారు. వ్యాపారిని రాజమహేంద్రవరంలోని లాలాచెరువు సమీపంలో వదిలి పరారయ్యారు. దిక్కు తోచని స్థితిలో ఆ నగల వ్యాపారి బొమ్మూరు పోలీసులను ఆశ్రయించాడు. వారు నల్లజర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. నల్లజర్ల పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక కంబాలపాలెం దళితపేటకు చెందిన యువతి(18) ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి సూసైడ్ నోట్ రాసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఉపస్మారక స్థితిలో చేరుకుంది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించారు. వినోద్ మిస్రా నగర్‌కు చెందిన రవి, తాను ప్రేమించుకున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. బుధవారం రవి కుటుంబసభ్యులు ఇంటికి వెళ్లగా అతని కుటుంబ సభ్యులు తనను నానా దుర్భాషలాడారని పేర్కొంది. మనస్తాపంచెంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపింది. రవి, అతని కుటుంబ సభ్యులే కారణమని అందులో పేర్కొంది.

సారా, మద్యం విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి-కడియం, చాగల్లు, రౌతులపూడి

కడియం మండలంలోని దుళ్ల, జేగురుపాడు శివారు పాముంటమెట్టలో నాటుసారా అమ్ముతున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. ఒక్కొక్కరి వద్ద నుండి 10 లీటర్ల సారా చొప్పున స్వాధీనం చేసుకున్నట్లు సిఐ పేర్కొన్నారు. కేసులు నమోదు చేసి వారిని న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు కృష్ణ సాయి, నాగదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చాగల్లు మండలం కలవలపల్లిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. ఆమె వద్ద నుండి 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రౌతులపూడి మండలంలోని ఎస్.పైడిపాలలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు అతని వద్ద నుంచి 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చొప్పెల్లలో వివాహిత హత్య

ప్రజాశక్తి-ఆలమూరు

చొప్పెల్లలో ఒక వివాహిత హత్యకు గురైంది. సిఐ ఎం.రామకుమార్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని చొప్పెల్లకు చెందిన వివాహిత సలాది మరియకుమారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. దీంతో ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. మరియకుమారికి బిక్కవోలు మండలం మేళ్లూరుకు చెందిన చల్లా గంగాధర్(ప్రసన్నకుమార్)తో వివాహేతర సంబంధం ఉందన్నారు. అతడు రెండేళ్లుగా గ్రామంలో తన అక్క బావలకు చెందిన ఇటుకబట్టీని నిర్వహిస్తున్నాడని తెలిపారు. మరియకుమారి, ఆమె భర్త ఇటుకబట్టీలోనే పనిచేస్తున్నారన్నారు. ఈ సమయంలోనే ప్రసన్నకుమార్ మరియకుమారికి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలిపారు. ఇటీవల ఆమె మరో యువకుడితో చనువుగా ఉంటున్నారన్నారు. ఈ విషయమై మరియకుమారి, ప్రసన్నకుమార్ మధ్య వాగ్వాదం చెలరేగిందన్నారు. ఈ సమయంలో ప్రసన్నకుమార్ మరియకుమారిని కోపంతో కొట్టి, గొంతు నొక్కి, ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడుతో గట్టిగా లాగడంతో స్పృహ కోల్పోయి చనిపోయినట్లు నిందితుడు తెలిపినట్లు సిఐ చెప్పారు. నిందితుడు గురువారం తాహశీల్దార్ వద్ద లొంగిపోయాడన్నారు. మరియకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారన్నారు.

బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన


ప్రజాశక్తి - పెదపూడి


బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల్యవివాహాల వల్ల కలికే అనర్థాలపై సంపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కల్పించారు. బేటి బచావో.. బేటి పడావోలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం త్రిమూర్తులు సిడిపిఒ ఎ.జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆదిలక్ష్మి హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు, వివాహ వ్యవస్థపై అవగాహన కల్పించారు. బాలికలకు 21, బాలురకు 25 సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు వివాహానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి బిడ్డ చక్కగా చదువుకొని లోకజ్ఞానాన్ని పెంపొందిం చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, సిఐటియు నాయకులు రాజేశ్వరి, ఎంఇఒ-2 సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కరప, తాళ్లరేవు


వాలంటీర్లను సత్కరిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్

వాలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ కురసాల కన్నబాబు అన్నారు. గురువారం స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో ఎంపిపి పి.శ్రీలక్ష్మి అధ్యక్షతన, వైసిపి మండల నాయకుడు చింత ఈశ్వరరావు ఆధ్వర్యంలో వాలంటీర్ల సేవా పురస్కారాలు అందించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. వాలంటీర్ల విధానం వైపు మిగిలిన రాష్ట్రాలు చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చీకాల అప్పలరాజు, సవిలే రాజేష్, రెడ్డిపల్లి రమేష్, మంగాదేవి, రాఘవ, వెంకటరమణ, ఎంపిడిఒ అప్పారావు, నాగేంద్ర, సతీష్, ఎంపిటిసి సభ్యులు గోవిందు, బి.వెంకటేశ్వరరావు, బి.అప్పారావు, చంటి బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలంలోని జి.వేమవరంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, జడ్‌పి మాజీ చైర్మన్ దున్నా జనార్ధనరావు పాల్గొని వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రేవు మల్లేశ్వరి, వైసిపి మండల అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్, కాంట్రేనికోన జడ్‌పిటిసి సభ్యులు నేల కిషోర్, ఉపాధ్యక్షులు కొపనాతి నాగరాజు, మాసా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య

ప్రజాశక్తి - సామర్లకోట

ఆంధ్రప్రదేశ్ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం సీట్ల ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వైస్ శివరామకష్ణయ్య తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. దారిద్ర్య రేఖ దిగువనున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల పిల్లలు, అనాథలు, హెచ్‌ఐవి బాధితులు, విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నివాస ప్రాంతాలకు సమీపంలోని ఐబి, సిబిఎస్‌ఇ, ఐసిఎస్‌ఇ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హులన్నారు. ఈనెల 23 నుంచి మార్చి నెల 14లోగా మీ సేవ లేదా మీ దగ్గరలో గల సచివాలయం, నెట్ సెంటర్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఆధార్, ఇతర ధృవ పత్రాలతో https://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 18004258599ను సంప్రదించాలని ఎంఇఒ తెలిపారు.



మహా రుద్రాభిషేకానికి ఇంటింటికీ ఆహ్వానం

ప్రజాశక్తి - గండేపల్లి

జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ ఈనెల 26 నుంచి నిర్వహించే మహా రుద్రాభిషేకానికి హాజరవ్వాలంటూ మురారిలోని ఇంటింటికీ గురువారం ఆహ్వాన పత్రికలను పంచారు. టిడిపి యువనేత, ఉపసర్పంచ్ జాస్తి వసంత్, టిడిపి గ్రామ అధ్యక్షులు సుంకవిల్లి రాజు ఆధ్వర్యంలో వీటిని పంచారు. పార్టీలకతీతంగా, కులమతాలకు అతీతంగా ఆహ్వానిస్తున్నామని వారు తెలిపారు. సర్పంచ్ కుక్కల ఆనంద్ పాల్గొన్నారు.

మండలంలో వరుపుల పర్యటన


పురస్కారాలు అందజేస్తున్న వరుపులసుబ్బారావు

ప్రజాశక్తి - రౌతులపూడి

నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. తొలుతగా ఎంపిపి కార్యాలయంలో వాలంటీర్ల పురస్కార అవార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాలంటీర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. అనంతరం పారుపాకలో గడప గడపకు వైసిపి కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రకృతిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. గిడజం గ్రామంలో టిడిపికి చెందిన 50 కుటుంబాలు వైసిపిలో చేరారు. వీరికి ఆయన వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పల్లపు చామవరం గ్రామానికి చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు కామిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు గురువారం వైసిపిలో చేరాయి. వారికి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి, వైస్ ఎంపిపి మంగా లక్ష్మి, వైసిపి ముఖ్య నాయకులు వాసిరెడ్డి జమీలు, యామన సురేష్‌బాబు, వైసిపి మండల అధ్యక్షులు పోలిపత్తి తాతాజీ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం



పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్‌ను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పుదుచ్చేరి అసెంబ్లీలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం యానానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ఒఎన్‌జిసి నష్టపరిహారం త్వరగా అందేలా చూడాలని కోరినట్టు ఎంఎల్ఎ తెలిపారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ఎంఎల్ఎ జక్కంపూడి రాజా గురువారం ప్రారంభించారు. ముక్కినాడ పాకల్లో రూ.45 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి, రూ.58.50 లక్షలతో మరో ఓవర్ హెడ్ ట్యాంక్, రూ.13 లక్షలతో ఎస్‌సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.15.74 లక్షలతో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. మల్లంపూడిలో రూ.46 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌క శంకుస్థాపన, రూ.20.8 లక్షలతో వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి, కొండగుంటూరులో రూ.63.4 లక్షలతో, జి.ఎర్రంపాలెంలో రూ.63.4 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జక్కంపూడి మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు పరిష్కరించామని చెప్పారు. ఈ కార్యకమాల్లో వైసిపి మండల కన్వీనర్ దూలం పెద్ద, జెడ్‌పిటిసి వాసంశెట్టి పెదవెంకన్న, మందారపు వీర్రాజు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణంలో రూ.19.00 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల హాస్పిటల్ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను నియమించడమే కాక అదనంగా ఆక్సిజన్, డిజిటల్ ఎక్స్ రే, డెంటల్ సేవలు, బ్లడ్ బ్యాంకు, ఆధునిక లాబరేటరీ ఏర్పాటు చేశామన్నారు. అతి త్వరలో డయాలిసిస్ సదుపాయం కూడా అందుబాటులో తీసుకువస్తున్నామని తెలిపారు.

సాగునీటి ఎద్దడితో రైతుల ఆందోళన

ప్రజాశక్తి -మామిడికుదురు


పొలంలో రైతుల నిరసన

నగరంలో గుర్రాల చెరువు ప్రాంతంలో సాగునీరు అందక వరి చేలు ఎండి పోతున్నాయంటూ గురువారం రైతు లు నెర్రలు తీసిన చేలు లో అధికారుల తీరు నిరసిస్తూ ఆందోళన చేశారు. సుమారు 200ఎకరాలకు సాగునీరు అందక పొట్ట దశలో ఉన్న చేలు నెర్రలు తీసి ఎండిపోతున్నాయని వాపోయారు. వంతుల వారీ నీరు అందిస్తా మన్న అధికారులు ఆ విధానాన్ని అమలు చేయడం. లేదన్నారు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన నిర్లక్ష్యం గా వ్యవహరిసున్నారన్నారు. ఇప్పటి వరకు ఎకరాకి రూ.30వేల పెట్టుబడి పెట్టామని రైతు తాటికాయల ఉదయభాస్కర్ తెలిపారు. కడలి సత్యనారాయణ, బొంతు భాస్కర్రావు, వి.సుబ్బలక్ష్మి, విత్తనాల సూర్య కాంతం, కూన నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణకు మూలం 'స్కాట్'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


స్కాట్ విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న ఎంపీ భరత్

విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్య సాహసాలు, సేవా గుణాన్ని అలవర్చేందుకు 'స్కాట్' ఎంతగానో ఉపయోగపడుతుందని రాజమహేంద్ర వరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని ఈస్ట్ రైల్వే కాలనీ, న్యూ రామాలయం వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కాట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్కాట్ ఉద్యమ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పావెల్ విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్కాట్ బాయ్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన స్కాట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమాజంలో పోలీసులు ప్రజలకు ఎలా సేవలందిస్తారో, అదే విధంగా విద్యార్థి దశ నుంచి సేవలు అందించేందుకు స్కాట్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. తద్వారా సమాజ సేవ, క్రమ శిక్షణ, సేవాతత్పరత అలవడతాయన్నారు. భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని చెప్పారు. రాజమండ్రి రైల్వే స్టేషను అభివృద్ధికి రూ.260 కోట్లను కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసిందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో రాజమండ్రి రైల్వే స్టేషన్లో 4, 5 ప్లాట్ ఫారమ్స్ తీసుకొచ్చామన్నారు. రాజమండ్రి విమానాశ్రయం రూ.355 కోట్లతో ఎలా అభివృద్ధి జరుగుతుందో అదే మాదిరిగా రైల్వే స్టేషన్‌నూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వే ప్రధాన స్టేషను అయిదు బళ్ల మార్కెట్ వద్దకు మారబోతోందని చెప్పారు. ఈ నెలలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని ఎంపీ భరత్ తెలిపారు. మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కానున్నాయని, మరో అయిదారు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు రాజమండ్రి జాతీయ రహదారిపై నిర్మితం కానున్నాయన్నారు. రానున్న రోజుల్లో నగర ముఖ చిత్రం పూర్తిగా మారబోతోందని ఎంపీ భరత్ తెలిపారు.

ఆదర్శంగా వాలంటీర్ వ్యవస్థ

ప్రజాశక్తి-కడియం

సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ, అనుబంధంగా వాలంటీర్ సేవా వ్యవస్థను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని జిల్లా ఇన్చార్జి మంత్రి, వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కార అవార్డులను మంత్రి అందజేశారు. కడియం మండలంలో 482 మంది వాలంటీర్లకు ప్రోత్సాహాన్ని అందించినట్టు మంత్రి వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, వైసిపి నాయకులు గిరజాల బాబు, యాదల సతీష్ చంద్రస్టాలిన్, రాష్ట్ర దేవాంగ దొంతంశెట్టి చినవీరభద్రయ్య, తడాల చక్రవర్తి, ఈలి గోపాలరావు, టేకి శ్రీనివాస్, దాసరి శేషగిరి, లావేటి రమేష్ పాల్గొన్నారు.

గన్ని కృష్ణకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కష్ణకు గురువారం మధురపూడి విమానాశ్రయంలో పార్టీ నాయకులు ఘనంగా స్వాగతించారు. చెన్నైలో గుండెకు పేస్ మేకర్ మార్పు కోసం సర్జరీ చేయించుకుని ఆయన తిరిగి వచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, గంగిన హనుమంతరావు, అర్బన్ అధ్యక్షులు రెడ్డి మణి, నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, కంటిపూడి శ్రీనివాస్, సంసాని ప్రసాద్, విశ్వనాథరాజు, రామినేని మస్తాన్ చౌదరి, చోడిశెట్టి వెంకన్న, జక్కంపూడి అర్జున్, కెవి శ్రీనివాస్, రాయి అప్పన్న, కవులూరి వెంకట్రావు, ఉమామహేశ్వరరావు, షేక్ మదీనా, పెందుర్తి నాగమణి, దొరబాబు, నల్లం ఆనంద్, కంచిపాటి గోవింద్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

బిజెపికి అధికారంలో కొనసాగే అర్హత లేదు

ప్రజాశక్తి - దేవరపల్లి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు, రైతులు

యువ రైతు కరణ్ సింగ్ మృతికి కారణమైన కేంద్ర బిజెపి ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక అర్హత లేదని రైతు సంఘం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు అన్నారు. ఢిల్లీలో రైతుల పోరాటంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం హర్యానా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధానికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం దేవరపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు ఈ సందర్భంగా ఉండవల్లి కష్ణారావు కృష్ణారావు మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర కోరుతూ రైతులు చేస్తున్న న్యాయమైన ఆందోళనపై బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు గత ఆందోళన సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రైతులపై యుద్ధం చేస్తోందని విమర్శించారు. రైతులు ఉద్యమాన్ని సైన్యంతో అణిచివేయాలని చూడడం అవివేకమన్నారు. రైతుల డిమాండ్లను సానుకూలంగా స్పందించి పరిష్కరించకపోతే ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పిన్నమనేని సత్యనారాయణ, ఆచంట సుభాష్ చంద్రబోస్, నడిగట్ల రామారావు, ఘట్టం నాని, సిఐటియు మండల కార్యదర్శి భగత్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ పాల్గొన్నారు.

'నా ఉపాధికి గండికొట్టొద్దు' చిరుద్యోగి ఆవేదన

ప్రజాశక్తి-మండపేట



తన ఉపాధికి గండి కొట్టి, తన కుటుంబానికి అన్యాయం చేయొద్దని ఇప్పనపాడు గ్రామానికి చెందిన చిరుద్యోగి వీరుళ్ల సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండపేటలో విలేకరుల సమావేశంలోఆయన తన గోడు వెళ్లబోసుకున్నాడు. 2022లో తాను తాపేశ్వరం లాకులవద్ద ఒప్పంద పరిధిలో లస్కర్‌గా విధుల్లో చేరానని అన్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తన పైఅధికారి జెఇ అజీజ్ ఆయన వ్యక్తిగత పనులకు వాడుకున్నారని అన్నారు. అంతే కాకుండా గడ్డిమందు అమ్మాలని, లాకుల వద్ద ఉన్న కొబ్బరి, అరటి, పనస వంటి ఫలసాయం అమ్మి వచ్చే ఆదాయం అక్కడి జెఇతో పాటు ఇతర సిబ్బంది తమ జేబులో వేసుకొంటున్నారని వాటికి అడ్డుగా వున్నాననే ఉద్దేశ్యంతో తనపై కక్షగట్టి ఉద్యోగం నుంచి తొలగించారన్నాడు. ఈ కారణంగా తాను అయిదు నెలల జీతం కోల్పోయానని అన్నాడు. తాను దళితుడైనందునే తనను ఉద్యోగం నుంచి తప్పించారని ఈ విషయంపై స్పంద నలో ఫిర్యాదు చేసినా, లేబర్ అధికారులను, ఉన్నతాధికారులను కలిసినా న్యాయం జరగ లేదని కన్నీరు పెట్టుకున్నాడు. నాయకులు, అధికారులు స్పందించి తనకు ఉద్యోగం ఇప్పిం చి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-నల్లజర్ల



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గంగాధర్ రావు

అన్ని శాఖల సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన పల్స్ పోలియో సమన్వయ కమిటీ సమావేశంలో డాక్టర్ గంగాధరరావు మాట్లాడారు. వచ్చే నెల మూడో తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని అందరం బాధ్యతాయుతంగా వ్యవహరించి విజయవంతం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు రెవెన్యూ, విద్య, అంగన్వాడీ శాఖల అధికారులతో సమావేశమైన వైద్యాధికారి డాక్టర్ గంగాధరరావు నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష జరిపారు. ప్రతి గ్రామంలో పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. తహశీల్దారు వర్ధనపు కిషోర్ కుమార్ మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కోసం ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు, అంగన్వాడీ టీచర్లకు ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వై.సత్యనారాయణ, బి.భగవతీదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు టి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.